

# ఫాతిమా గది





సాయంకాలం అయినా మనుషుల జాడ లేదు. పగలు అక్కడో ధర్నా జరిగింది. లాఠీఛార్జీ కూడా. రోడ్డుపై నడుస్తుంటే విధ్వంసం దృశ్యాలు దృశ్యాలుగా ఎదురయి - ఒక ఆర్త నాదం - బాధతో వేసిన పెనుకేక, గుంపులు గుంపులుగా జనం పరుగులు పెట్టడం - దృశ్యం ఒకటి. రోడ్డు మీద వదలి వెళ్ళిన చెప్పులు, సగం ఖాళీగా ఉన్న టీ గ్లాసు, తింటూ వదిలేసిన రొట్టె ముక్క, దాన్ని పొర్లిస్తున్న వీధికుక్క - మరో దృశ్యం. "ఈ జంక్ అంతా నింపు తావు. ఎడిట్ చేసుకోలేక చస్తున్నాం!" న్యూస్ ఎడిటర్ గొణిగాడు.

లోకల్ టీవీ వార్తల కోసం న్యూస్‌స్టోరీలు, ఇంటర్వ్యూలు అందించే ఉద్యోగం నాది. ఉద్వేగాన్నిచ్చే కథనాలు కావాలంటారు. మంత్రుల చుట్టూ, వి.ఐ.పిల చుట్టూ పుట్టగొడుగుల్లా మూగి - ఏం ఉద్వేగం ఉంటుంది ఆ కబుర్లలో. ఒకసారి రేప్ విక్టిమ్‌ని ఇంటర్వ్యూ చేస్తూ, చీలిన పెదాలను, తెగి పక్కకు వాలిన బ్రెస్ట్‌ను తీస్తే "మైగాడ్! ఎంత నాసియేటింగ్‌గా ఉంది. హారర్ మూవీలా ఉంటాయి నీ క్లిప్పింగులు. నొటోరియస్ లేడీవి నువ్వు" అంటూ ఎడిటర్ ఎంతో గింజుకొన్నాడు.

* * *

సలీం ఉత్తరాలు క్లుప్తంగా ఉంటాయి. కోడిగీతల్లాంటి నాలుగు వాక్యాల్ని, చౌకబారు పేపర్‌పై రాసి, కవరుపై స్టాంపులు అంటించకుండా పంపుతాడు. కొన్ని ఉత్తరాలు అట్లాగే అతని బ్యాగ్‌లో ఉండిపోతాయి. ఒక్కో ఉత్తరం నెలరోజులు ప్రయాణం చేస్తుంది. తీరా ఉత్తరం వచ్చాక దాన్ని విప్పాలంటే భయం, రెండు మూడు నిమిషాల్లోనే మొత్తం అనుభూతి అంతా ఆవిరై పోతుందని. ఉత్తరం పెద్దగా చదువుతాను. అతని కంఠస్వరం అక్షరాల చాటు నుంచి మృదువుగా వినబడుతూ ఉంటుంది.

సలీం అంటే నాకెంతో ఇష్టం. సలీం మాత్రం చుట్టూ గాజు తెర ఏదో కట్టుకొని ఉంటాడు. లోపలికి ప్రవేశం ఉండదు. అన్నీ తెరకివతలే. నాతో గంటలు గంటలు కబుర్లు చెబుతాడు. ఎన్నో కథలు చెబుతాడు. అయితే, అన్నీ గాజుతెరకు అవతలే. 'జర్నలిస్టిక్ సింద్రోమ్' అంటాడు. "మనమధ్య ప్రేమలాంటిదేమీ లేదు. ఉండదు కూడా. శాపగ్రస్తమైన నగరాల్లో ఎవరూ

ప్రేమల గురించి మాట్లాడరు" అని సహజమైన నిర్లిప్తతతో చెబుతాడు. కలిసినప్పుడు కెమెరా కళ్ళతో మేం చూసిన ఎన్నెన్నో విషయాలు కథలుగా చెప్పుకొంటాం. అట్లా చెప్పుకొంటూ చెప్పుకొంటూ మేమే ఒక కథలా మారిపోతాం. గాఢమైన చీకటిలో మా శరీరాలు దగ్గరవుతాయి. కరెంట్ ఉండదు. ఉక్కపోత. క్రూరమైన, బాధాకరమైన ప్రకియలా, ఇద్దరం పోట్లాడుకొంటున్నట్లుగా లేదా మల్లయోధులు పెనుగులాడుతున్నట్లుగా, మా శరీరాల నుండి కాస్త హాయిని, ప్రేమలాంటి ప్రేమను పిండుకొంటాము.

సలీంకి ఫాతిమా అనే పెంచిన తల్లి ఉంది. 'అమ్మీ' అని పరిచయం చేశాడు. ఆమెకొక వింత జబ్బు. ఏదీ గుర్తుండదు. ఆకలి, దాహం, నిన్న, నేడు - మనుషులు, సంబంధాలు అన్నీ మరచిపోయింది. గాజుకళ్ళతో ఎటో చూస్తూ ఉంటుంది. అట్లాగే కదలకుండా, ఒకానొక ప్రదేశంలో పెట్టిన వస్తువులా. ఆమె ఒక భయం గొలిపే దృశ్యం. ఆమెకు స్నానం చేయించడం, అన్నం తినిపించడం అన్నీ సలీమే చేసేవాడు. ఏ హెచ్చరికా లేకుండా ఒకరోజు ఫాతిమాను మా అపార్ట్‌మెంట్‌కు తెచ్చాడు. "కొన్నాళ్ళిక్కడ ఉంటుంది" అన్నాడు ఏ ఉపోద్ఘాతమూ లేకుండా. ఆమెకో గదిని ఏర్పాటు చేశాం, పడమటి దిశలో. ఆ గదిని 'ఫాతిమా గది' అని పిలుచుకొనేవాళ్ళం. అమ్మా, నాన్న, నేనూ - ముగ్గురం భయం భయంగా గడిపాం ఒక వారంరోజులు. దుర్గంధం, భయం, చెప్పరాని దిగులు - ఒంటరిగా ఆ గదిలోకి వెళ్ళడానికి సాహసించేదాన్ని కాదు. భయానికి ప్రతీకలాగా ఫాతిమా గది. వారమో, రెండు వారాలో అనుకొన్నాం. కానీ, నెలలు దాటింది. క్రమంగా ఫాతిమా గది మా ఇంట్లో భాగమైపోయింది.

* * *

సలీంకి ఉత్తరం రాసి, కవర్లో పెట్టి అతికించిన తరువాత, ఆ ఉత్తరాన్ని అట్లాగే చేతుల్లో పెట్టుకొని, అతనితో ఒక సంభాషణ ప్రారంభిస్తాను. అతని సన్నని చిరునవ్వు, 'ఆహా' అంటూ సన్నగా తల పంకించడం, చేతుల్ని నడుంపై పెట్టుకొని అభినయాత్మకంగా నిలబడటం - నేను సంభాషణ మొదలుపెడతాను. ఎదురుగా అభౌతికంగా అతను. ప్రియమైన విషయాలు ఎన్నో చెప్పాలనుకొంటాను. కొన్ని పదాలు గుర్తుకొచ్చి, కొన్ని రాక - ఇబ్బందిపడుతూ - ఫాతిమా గది గురించి, రాత్రిపూట ఆ గదిలోంచి, తలుపు సందుల్లోంచి వందలాది బొద్దింకలు బయటకు తోసుకొస్తున్నట్లు అనిపించడం, ఎవరితోనూ ఏ స్నేహం, ఏ సంబంధం పెంచుకోలేని స్థితి గురించీ, ఇవాళ్టి టీవీ హెడ్‌లైన్ల గురించి, వాటి మధ్యన నేను షూట్ చేసిన క్లిప్పింగుల గురించీ, చెదిరిపోతున్న సంధ్యల

గురించీ, అర్ధరాత్రి ఇంటి పక్కనుంచి వెళ్ళే విమానాల హోరు గురించీ, సన్నటి ఎలుక పిల్ల రాత్రిపూట కాలిని కొరికిన విషయం - ప్రతిదీ అతనితో చెబుతాను. గాలితోనూ, నీడలతోనూ నేను సంభాషిస్తున్నాననుకొని అమ్మ కంగారు పడుతుంది.

ఫాతిమా గది భయంతో ఇప్పుడు రాత్రులు స్టూడియోలోనే పడుకొంటున్నాను. నేను పడుకొనే గదిలో డాన్స్ పోటీల కోసం కట్టిన స్టేజీ ఉంది. రంగులు, కాస్ట్యూమ్స్ వేసుకొని చిన్నచిన్న పిల్లలు ప్రేమనీ, విరహాన్నీ ప్రాక్టీసు చేస్తుంటే దుఃఖమో, కోపమో తోసుకు వచ్చేవి. ఆ గదిలో నేలపై డైలీ సీరియళ్ళలోంచి పారిపోయి వచ్చిన గ్లిజరిన్ కన్నీళ్ళు, ముతక వాసనల డైలాగులు - మూలన చాలా వీడియో కెమెరాలు, లెన్స్‌లు అట్లా భూమివైపు తిరిగి పశ్చాత్తాపంగా చూస్తున్నట్లుగా. రాత్రిపూట స్టూడియో పొడవాటి చీకటి కొట్టులా ఉంటుంది. ఇది స్టూడియో అనీ, నకిలీ ప్రపంచమనీ పదేపదే మనసుకు తెలియజేసుకోవాల్సి వచ్చేది.

ఫాతిమా గది గుర్తుకొచ్చేది. ఆమె గదిలోంచి వందలాదిగా బొద్దింకలు తలుపు సందుల్లోంచి తోసుకు వస్తున్నట్లుగా, లోపలి ఫాతిమా శరీరం శిథిలమై, శరీరం, కండరం, ఎముకలు వగైరాలుగా విడిపోయి, భీకరమైన దుర్గంధం స్టూడియో దాకా ప్రయాణించి - ఉలిక్కిపడి అంత రాత్రి అపార్ట్‌మెంట్‌కు వెళ్ళేదాన్ని. ఫాతిమా గది తలుపు ముందుకు తోసి... లోపల ఫాతిమా మంచం పైన నిద్రాకాని, మెలకువాకాని ఒక స్థితిలో అట్లా గుడ్లు తెరుచుకొని - టేబుల్‌పై అన్నం నిన్నటిదో, మొన్నటిదో - ఆ గది కాలంతో పాటు కదలకుండా మొరాయిస్తున్నట్లు -

* * *

మిత్రుల ద్వారా సలీంకి ఉత్తరాలు పంపుతాను - అపరిచితుడికెవరికో రాస్తున్నట్లు. ఊహకు వచ్చిన కబుర్లు - చిత్రంగా ఊహల్లోని కబుర్లే ఉత్తరాలు రాసిన కొద్దిరోజులకు నిజాలయ్యేవి. వట్టి అబద్ధాలే రాసేదాన్ని. ఆశ్చర్యం, అవే నిజాలుగా రూపాంతరం చెందేవి. కాగితం పైకి అక్షరాలుగా ప్రయాణించే లోపలే ఇవాళ నిన్నటిలా మారిపోతుంది. అందుకే నా ఉత్తరాలు గతంలోని కబుర్లలా తోచేవి. ఉత్తరాల పేరుతో ఒకానొక మాయా ప్రపంచాన్ని నేను సృష్టిస్తున్నాను. సలీం గతంలోని వ్యక్తి. నేను ఇవాల్టిదానిలా - ఇద్దరినీ కలిపి ఒక సంఘటనగా, లేదా ఒకే కథా కాలంలోకి తీసుకురావాలని నా ఆరాటం.

ఫాతిమా గదిలోంచి వచ్చే దుర్గంధం ఒక్కోసారి భరింపరానిదిగా వుండేది. తలుపులకు, కిటికీలకు గుడ్డలు కుక్కి, రకరకాల సెంట్లు, పెర్ఫ్యూమ్‌లు వెదజల్లి, ఆ దుర్గంధం అట్లాగే ఉండేది. అది దుర్గంధం అనడానికి వీల్లేదు. ఒక వింత వాసన. గాఢమైన, తీయని చెమట లాంటి, రక్తంలాంటి, దుఃఖంలాంటి, కలలు చచ్చిపోవడంలాంటి వాసన. అది శరీరాలు కుళ్ళిపోతే వచ్చే వాసనలా కాకుండా, ఆత్మలు దహింపబడుతున్నప్పుడు ఎగసివచ్చే వాసనలా ఉండేది. ఒక్కోసారి ఆటో పిలిచి, అందులో ఫాతిమాని, ఆమె వస్తువుల్ని ఉంచి, దూరంగా ఎక్కడన్నా వదిలి రావాలనే కోరిక కలిగేది. కానీ, సలీం గుర్తుకు వచ్చేవాడు. ఇద్దరికీ మధ్యన నిలిచిన ఇమాజినరీ వంతెనలా తోచేది ఈ ఫాతిమా.

* * *

కాందహార్ నుంచి, కాబూల్ నుంచి వచ్చిన వార్ క్లిప్పింగ్స్ చాన్నాళ్ళు మనసును కలిచివేశాయి. కూలిపోయిన భవనాలు, ఇళ్ళ ఫోటోలవి. రకరకాల దశల్లో తీసినవి. బాంబులు వెయ్యక ముందు, తరువాత - ఒకానొక ప్రాంతం క్రమంగా ఎట్లా అదృశ్యం అవుతుందో - చివరి క్లిప్పింగ్‌లో విధ్వంసం తాలూకు పోలికలు కూడా కనబడలేదు. ఒక మహా శూన్యం. బహుశా మనం కూడా, మన విశ్వాసాలు, ప్రేమలు, స్నేహాలు కూడా ఇట్లాగే అదృశ్యమయి -

సరిగ్గా ఇట్లాంటిదే, క్షణాల్లో సమస్తం అదృశ్యమైపోయిన ఒక ఇల్లు గురించి సలీం ఎప్పుడూ చెబుతూ ఉండేవాడు. సలీం తాలూకు ఆ ఇంటిని నేనెప్పుడూ గుర్తు పెట్టుకోవాలనే అనుకొంటాను. పాతబడిన తలుపులు, పెచ్చులూడిన గోడలు, కిటికీల్లోంచి తోసుకువచ్చే శబ్దాలు - మనుషుల సంభాషణలు, పాటలు, ఏడ్పులు, నవ్వులు - గాఢమైన నిట్టూర్పులు - వీటన్నిటితో సహా ఆ ఇల్లు కూలిపోవడం, బుల్‌డోజర్లు, ప్రొక్లైనర్లు, మాంత్రికుని హస్తాల్లా మెల్లమెల్లగా ఇంటిని అదృశ్యం చెయ్యడం - రాళ్ళగుట్టల మధ్య నుండి ఫాతిమాని నడిపించుకొస్తున్న సలీం - ఇప్పుడా ఇంటి కోసం పిచ్చిగా తిరుగుతాడు సలీం. కూలిన గోడలు, కనీసం పునాదులు - ఏ ఆనవాలూ లేదు. ఎంత హఠాత్తుగా మాయమైంది. ఆ విధ్వంసం గురించి చాలాసార్లు సలీంతో మాట్లాడాలనుకొంటాను. సానుభూతిలాంటిదేదో చూపాలని ప్రయత్నిస్తాను. సన్నగా కన్ను గీటుతాడు. "ఆ ఇల్లు బలమైన కోరిక. దాని అదృశ్యం కోరిక నుంచి విముక్తి" అంటూ రెండు చేతుల్ని పైకి ఎత్తి, రెక్కల్లా గాలిలో ఊపుతాడు.

చాన్నాళ్ళ క్రితం సలీంతో కలిసి ఒక కొత్త ప్రదేశానికి వెళ్ళాను. ప్రయాణమంతా రాత్రిపూట జరిగింది. అది సలీం సొంత ఊరు. దొంగల్లాగా తచ్చాడుతూ ఊరంతా తిరిగాము. చాలా ప్రదేశాలు చూపించాడు సలీం. ముఖ్యంగా వాళ్ళ ఇల్లు. ఇప్పుడక్కడ ఏమీలేదు. చుట్టూ ముళ్ళతీగలు, 'లోపలికి ప్రవేశించరాదు' అనే నిషేధపు బోర్డు. చివరి మజిలీగా ఊరి చివరన ఉన్న ఫోటో స్టూడియో. ముసలి నవాబులా ఉన్న మనిషెవరో కౌంటరులో కూర్చున్నాడు. గదులు గదులుగా ఉన్న స్టూడియోలో, చివర్న ఒక గది. చెక్కగోడలోంచి దానిలోకి ప్రయాణం. దుమ్ముతో, బూజుతో చాలా ఏళ్ళుగా తెరవనట్లుగా ఉంది. "ఇది నా ఆత్మ నివసించే గృహం" అన్నాడు గంభీరంగా. గదిలోని గోడల నిండా వందలాది ఫోటోలు. పెరేడ్‌లా, ఫోటో ఎగ్జిబిషన్‌లా. వందలాది ఫాతిమాలు. వందలాది సలీంలు. "ఇక్కడ మొదలుపెట్టి చివరిదాకా చూడు. ఒక్కొక్క ఫోటో ఒక కథను చెబుతుంది" అన్నాడు. అతని ముఖంలో దిగులులాంటి, దుఃఖంలాంటి భావన. మొగల్ యువరాణిలా మెరిసిపోతూ ఫాతిమా. పాతికో, ముప్పయ్యో ఏళ్ళుంటాయి. సన్నగా దువ్విన జుట్టు, కొత్త నిక్కరు, చొక్కా, ఏడేళ్ళ కుర్రాడు – సలీం. "నేనే" సన్నగా నవ్వాడు సలీం. గాఢంగా నిట్టూర్చి, "నన్ను ఏడొందలకు కొనుక్కొంది అమ్మీ" కథల్లోని పాత్రలా మాట్లాడాడు సలీం. ఉలిక్కిపడ్డాను నేను.

"ఫాతిమా అమ్మీ ఇంటి ముందు వదిలేసి కేవలం ఏడొందలు మాత్రం పుచ్చుకొని వెళ్ళిపోయింది ఓ అమ్మ. ఆమె కథ నాకు తెలియదు. ఈ రెండో అమ్మ ఎప్పుడూ చెప్పలేదు" చూస్తుండగానే సలీం ఉద్వేగపూరితమైన డైలాగులు చెప్పే నటుడయ్యాడు. "ఇందాక చూసిన నిషిద్ధ ప్రదేశంలో ఒక డాబా ఇల్లు ఉండేది. మొదట్లో అదో చిన్న పూరిపాక. ఆ పాకలోనే 'ఫాతిమా ఆక్షన్ హాలు' ఉండేది. కుటుంబం చితికిపోయి, అబ్బా ఆరోగ్యం పాడయిపోయి, ధైర్యం చేసి, బాగా బతికున్న రోజుల్లో కొనుక్కొన్న వస్తువులతో ఆక్షన్ హాలు మొదలు పెట్టింది. ఆ రోజుల్లో ఫాతిమా ఆక్షన్ హాలంటే ఊరులో గొప్ప పేరు. నగలు, డాక్యుమెంట్లు, ఆస్తులు, గ్రామఫోన్ రికార్డులు, రేడియోలు, టేప్ రికార్డర్లు – అన్నిరకాల వస్తువులు దొరికేవి. ఉజ్జ్వలమైన రోజులు. అమ్మీ ఏది పట్టుకొన్నా బంగారమే. మేముండే ఆ మేడ ఆక్షన్‌లో కొన్నదే. గొప్ప వ్యాకరణ పండితుడిది. ఆ మేడ అమ్మీకొక సెంటిమెంట్. ఇష్టం. అమ్మీకి ఇష్టమైన మరోచోటు ఈ ఫోటో స్టూడియో. దీని యజమాని జాన్ బాషా. అబ్బాకి స్నేహితుడు. అమ్మీ, నేను స్పెషల్‌గా తయారై స్టూడియోకి వచ్చేవాళ్ళం. వారానికొక బ్లాక్ అండ్ వైట్ ఫోటో. 'ఇవి ఫోటోలు కావు. మన రోజువారీ కథలు' అనేది అమ్మీ. నా

పదిహేనేళ్ళ వయసప్పుడు అబ్బా, జాన్‌బాషా మద్రాసు వెళ్ళారు సినిమాలు తీయాలని. అమ్మీ ఆస్తులన్నీ అమ్మేసింది. సంవత్సరం తరువాత ఖాళీ చేతుల్తో వచ్చారు. 'మద్రాసు సినిమా ఫీల్డంతా పాగల్ దునియా. మనలాంటి వాళ్ళు నెగ్గలేరు' అని సరిపెట్టుకొంది అమ్మీ. తొంభైల్లో ఆర్థిక మాంద్యం. అబ్బాకు క్షయవ్యాధి పట్టుకొంది. డబ్బుకు కిటకిటగా ఉండేది. రెండుపూటలు తిండి తినడం లగ్జరీ అయిపోయింది. క్షయవ్యాధి ముదిరి అబ్బా కాలం చేశాడు. ఆ సంవత్సరమే అనుకోని ఆపద వచ్చిపడింది మాపై. మేముండే ఇల్లు పోయిన శతాబ్దానికి చెందిన కవిదట. ఖాళీ చెయ్యమని గవర్నమెంట్ నోటీసు ఇచ్చింది. ఇంటి ముందు ధర్నాలు, గొడవలు. చివరికి బలవంతాన ఇంట్లో నుంచి నెట్టేశారు. ఆరోజు నాకు బాగా గుర్తు. ధమధమ శబ్దం చేసుకొంటూ బుల్‌డోజర్ మా బజారుకు వచ్చింది. ఏ హెచ్చరికా లేకుండా ఇంటిపైన రాక్షసిలా పడింది. అమ్మీ గుండెలు బాదుకొంటూ ఏడ్చింది. రాక్షసుడి హస్తంలా బుల్‌డోజర్. నిమిషాల్లో మేడ అదృశ్యమైంది. మా సామాన్లనే కాదు, మా కబుర్లు, నవ్వులు, ఏడుపులు, మా పాటలు, ఆనందాలు - అన్నిటినీ కూల్చేసింది. ఆ సంవత్సరమే అమ్మీకి ఈ భయంకరమైన జబ్బు పట్టుకొంది. క్రమంగా అన్నీ మరచిపోయింది. దుఃఖపడాలన్న విషయం కూడా...." సలీం కళ్ళనిండా దిగులు. ఆ కూలిపోయిన మేడ దృశ్యాలన్నీ సలీం కళ్ళల్లో ఇప్పటికీ ఉన్నాయేమో అనిపిస్తుంది.

* * *

నిద్ర పూర్తి కానేలేదు. నిద్రలోనిదే ఒక పీడకల. అదింకా కళ్ళకు అంటి పెట్టుకొనే ఉంది. ఎదురుగా బొద్దింక. నేల పైనా, గోడల పైనా ఎగురుతూ, క్రమంగా మంచం దగ్గరకు వచ్చి, ముందుగా కాలిజోళ్ళ పైనా, తరువాత దుప్పటి పైనా, కాసేపటికి నా శరీరం పైనా నిర్భయంగా ఎగురుతోంది. ఒకచోటి నుండి ఇంకో చోటికి. అది బొద్దింకలా కాకుండా, బొద్దింక సైజు ఇంజనులా ఉంది. దేన్నించి అదలా పరుగెత్తుతోందో అర్థం కాదు. ప్రాణభయమా? లేదా జీవితం పై ప్రేమా? లేచి కాలిజోళ్ళు తొడుక్కొంటూ ఉండగా - కాలికీ, కాలి జోడుకీ మధ్యన బొద్దింక. ప్రాణభయంతో గిజగిజలాడి - మెత్తటి జిగురులాంటి తడి ఏదో పాదానికి తగిలింది. చాలాసేపు అట్లాగే అంటుకొని ఉంది పాదానికి, ఆ బొద్దింక శవం.

* * *

మునిసిపాలిటీవాళ్ళు కుక్కల్ని చంపే కార్యక్రమాన్ని షూట్ చేస్తున్నాను. ఢమఢమలాడుతూ డొక్కువ్యాన్ - తాళ్ళు, వలలు విసరి, వ్యాన్ వెనుక బోనులో వందకు పైగా కుక్కలు - ఊరి చివర వాటిని చంపేసే కార్యక్రమం. తలపై ఫట్‌మంటూ గాయం. భీకరంగా అరుస్తూ, మూలుగుతూ అటుఇటు పెనుగులాడి, నొప్పినో, భయాన్నో తగ్గించుకోవడానికి నోటికందిన ప్రతి వస్తువునూ కొరుకుతూ - సంవత్సరం వయసు కూడా లేని కుక్కపిల్ల ఒకటి తల పగిలి, నెత్తురు నెత్తురుగా -

సలీంకి, సిటీలో నాకు ప్రియమైన ప్రదేశాలన్నీ చూపించేదాన్ని. అతని చేతిలో కెమెరా. ఏదీ వివరించనక్కరలేదు. ఇట్టే అర్థమవుతాయి అతనికి. ముఖం మాత్రం నిర్లిప్తంగా, ఏ కదలికా లేకుండా - కుక్కల్ని చంపడానికి తీసుకువచ్చిన ఈ స్థలం ఒకప్పుడు ఎత్తైన రాతిగుట్ట. పొడవాటి చెట్లు, నేచురల్ రాక్ - ఎంతగానో ఇష్టపడ్డాడు సలీం. ఇప్పుడా ప్రదేశంలో కొండలేదు. చెట్లు లేవు. గులకరాళ్ళ గుట్టలున్నాయి. వాటి మధ్యన రక్తం, హింస, మరణం -నా కెమేరా కుక్కలను చంపడం గురించి కాకుండా స్థలాలన్నీ ఇట్లా అదృశ్యమవడాన్ని చిత్రీకరిస్తోంది.

ఇట్లాగే సలీంతో పాటు హైదరాబాద్ వీధుల్లో - సలీం చేతుల్లో కెమేరా. నిశ్శబ్దంగా, మౌనంగా, అతని కెమేరా ఒక్కటే మాట్లాడుతోంది. ఈ నిశ్శబ్దం ఒక్కోసారి భయపెడుతుంది. ఇదీ ఒక ప్రతీకారచర్యేమో అనిపిస్తుంది. చేతిలో కెమేరాతో వట్టి నీడలాగే నా వెంట నడిచేవాడు. నేను చిన్నప్పుడు చదివిన స్కూలు చూపించాను. ఫ్లై ఓవర్‌కి అడ్డు వస్తుందని దాన్ని కూల్చేశారు. మొండి గోడలు, విరిగిన బల్లలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. ఫ్లై ఓవర్ పై నుండి చూస్తుంటే బడిలో నేనింకా నడుస్తున్నట్లే ఉంటుంది. క్లాస్‌రూమ్, బ్లాక్ బోర్డ్, నేను కూర్చునే బెంచి, శిథిలాల మధ్యన నిన్నటి చరిత్రంతా ఉంది. స్కూలు పక్కనే ఒక హోటలు. ఇరానీ టీ స్టాలు. అదిప్పుడు మూతపడింది. దాని స్థానంలో షాపింగ్ మాల్ వచ్చేసింది. నాలుగు అంతస్తుల బిల్డింగ్ ముందు పాన్‌వాలా మాత్రం నిన్నటి జ్ఞాపకానికి గుర్తుగా మిగిలి ఉన్నాడు. వెడల్పాటి ఇత్తడి పళ్ళెం, దానిమీద గుండ్రంగా అమర్చిన పాన్‌డబ్బాలు. కొద్దిగా దూరంగా, నిజాం కాలేజీ వెనుక నున్న పార్కు. ఇప్పుడా పార్కులో చెట్లు లేవు. రెండు, మూడు ఇనుప ఉయ్యాల, జారుడుబండలు ఉన్నాయి. ఆ పార్కులో ఒక మూలన క్లాస్‌మేట్స్ అందరం కూర్చుని - పిరికిగా, భయంగా ఉండే కుర్రాడొకడిని, అల్లరి చేస్తూ వాడి బుగ్గను కొరికి - ఆ దృశ్యాలన్నీ కెమేరాకు చెబుతూనే ఉన్నాను. సలీంకు దగ్గరగా చేరి, అతని మెడ చుట్టూ చెయ్యివేసి, అతని గుండెలపై తలవాల్చి,

'అయామ్ ప్రెగ్నెంట్' అన్నాను. అతనిలో రెస్పాన్స్ ఏమీ లేదు. నిశ్శబ్దపు కళ్ళను దూరంగా ఉన్న పొడవాటి బిల్డింగ్స్ వైపు తిప్పాడు. అతని కళ్ళలో ఒక వింత ప్రతిమ. బహుశా పొరలు పొరలుగా విడిపోతున్న ఫాతిమా రూపమేమో. "రేపే రిజిష్టరాఫీసుకు వెళదాం" అన్నాడు. నేనేమీ మాట్లాడలేదు. కానీ, "నీ కళ్ళలోని భయంకరమైన నిశ్శబ్దం నన్ను భయపెడుతోం"దని చెప్పాలనిపించింది.

సలీం నుంచి ఉత్తరాలు లేవు. వారం వారం నేనే రాస్తుంటాను. బహుశా ఉత్తరాలే నన్నూ, సలీంనీ కలిపే రహస్య స్పర్శ. ఎప్పుడో ఒక్కసారే పదో, ఇరవయ్యో ఉత్తరాలు అతని దగ్గర నుంచి వస్తాయని ఆశ. బహుశా ఈ క్షణంలో అతనో ఉత్తరం రాస్తూ ఉండి ఉంటాడు.

* * *

అపార్ట్‌మెంట్ నుంచి బయటికి వెడుతూ ఫాతిమా గది ఒకసారి తెరిచాను. తెల్లటి మనిషి రూపపు ఛాయలా, సన్నటి పోగులో, ఎముకలో, కండరాలో వాటికి చర్మాన్ని చుట్టి, చీరకట్టి నిలబెట్టినట్లు - ఆమె నిజం కాదనీ, ఆమె ఒక ఊహ అని గట్టిగా అనిపిస్తుంది.

కానీ, ఆమె ఒక నిజం. ఒక శరీరం. గతాన్ని, వర్తమానాన్ని ఆమె నుంచి లాగేసినట్లుంది. ఆమె ఒక స్థితి. చాలాసేపు గుమ్మం దగ్గరే నిలబడి, దీర్ఘంగా నిట్టూర్చి, రోడ్డు పైకి వచ్చాను.

రోడ్డుపై కుక్కల గుంపు. ప్రచండ వేగంతో పరుగెడుతున్నాయి. పదో, ఇరవయ్యో వాటి ముఖాల్లో మరణ భయం. రౌద్రం. పెను కోపం. అప్పుడే రోడ్డు పైకి వచ్చిన నా పై ఒక్కసారిగా దాడి చేశాయి. భయంతో పరుగెట్టాను. పట్టు తప్పి దబ్బున రోడ్డుపై పడ్డాను. అరుపులు, కేకల మధ్య ఉగ్ర కోపంతో, మృతువులా ఆ కుక్కలన్నీ నా మీద పడ్డాయి.

* * *

శరీరం నిండా గాయాలు. వరదలుగా రక్తం. సలీం కోసం కబురు చేశాను. రమ్మని బతిమాలాడుతూ, రానందుకు ఆగ్రహపడుతూ - టెలి గ్రాములు, ఈ-మెయిల్, అన్నిచోట్లకూ టెలిఫోన్లు - వందలకొద్దీ నేప్‌కిన్‌లు రక్తంతో తడిసి ముద్దయి - సలీం దగ్గర నుంచి కబురు లేదు. అపార్ట్‌మెంట్ అంతా, టవల్స్, మంచం, బెడ్‌షీట్స్ అంతటా రక్తమే.

శరీరం లోపల వెచ్చగా పెరుగుతున్న ఒక కల అబార్టు అయింది.

* * *

వీడియో కెమేరాను తీసుకొని, నా పరిసరాల నుంచి విడిపోయి నేను ఎట్లా అదృశ్యమవుతున్నానో - అంతట్నీ ఫ్రీజ్ షాట్లుగా - అపార్ట్‌మెంట్‌ను, అందులోని అన్ని వస్తువుల్ని, సీలింగ్ ఫ్యాన్‌ని, ఇక ఎప్పటికీ తిరిగలేని దాని స్థితిని, నా కుర్చీని, నా మంచాన్ని, ఖాళీ బాత్‌రూమ్‌ని, టేబుల్ పైని గ్లాసుని, వండిన అన్నాన్ని, కూరల్ని ఎప్పటి నుంచో ఎవరూ ముట్టుకోనట్లుగా ఉన్న ఖాళీ చెప్పుల్ని, ఆన్ చెయ్యని టీవీని, ఏ ప్రతిబింబమూ లేని అద్దాన్నీ, ఒక శూన్యాన్ని -

* * *

ఫాతిమా గదిలోకి వెళ్ళాను. అదే వాసన. కలలు తగలబడుతున్న వాసన. ఆత్మలు ఖననం అవుతున్న వాసన. వాసనలోంచి, నిశ్శబ్దంలోంచి ప్రయాణించి ఆమెను ముట్టుకొన్నాను. ఫాతిమా కిటికీలోంచి ఎటో చూస్తూ నిలబడింది. నా స్పర్శ, ఉనికి ఆమెకు తెలిసినట్లు లేదు. కాసేపటికి నేనూ ఆ రూమ్‌లా మారిపోయాను. క్రమంగా నేనూ ఫాతిమాలా మారిపోతున్నట్లుగా, శరీరం పోగులు పోగులుగా విడిపోతూ, జ్ఞాపకాలన్నీ అదృశ్యమవుతూ, ఖాళీ అద్దంలా మిగిలిపోతూ -

భయంతో బయటకు పరిగెత్తాను.

*- ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక, 2002*